
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 8 మే 2025



ప్రశ్నార్థకం!

భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ భవిష్యత్‌పై నీలినీడలు

లీజు గడువు ముగిసింది.. ఖాళీ చేయాలని వైసీపీ ప్రభుత్వంలో నోటీసులు

మచిలీపట్నం మండలం పల్లెతుమ్మలపాలెంలో ఉన్న భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల ఏర్పాటుకు భూములను ఇచ్చే క్రమంలో ఈ ఫ్యాక్టరీని ఖాళీ చేయించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది. కంపెనీ యాజమాన్యానికి భూములను ఖాళీ చేయాలని కలెక్టర్ ద్వారా 2023 సెప్టెంబరులో ఉత్తర్వులు జారీ చేయించింది. మళ్లీ 2024లో జారీ చేసిన ఉత్తర్వుల్లో ఫ్యాక్టరీ లీజు గడువు పూర్తయ్యిందని, ఖాళీ చేయాలని, ఖాళీ చేసే సమయంలో రూ.300 కోట్లను ప్రభుత్వానికి చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. వివిధ కారణాలతో ఫ్యాక్టరీలో ఈ ఏడాది పనులు నిలిచిపోయాయి. దీంతో మూడు గ్రామాల ప్రజలు ఉపాధి కోల్పోయారు.

- హైకోర్టును ఆశ్రయించిన కంపెనీ యాజమాన్యం
- కరకట్టకు గండ్లు పడటంతో ఈ ఏడాది నిలిచిపోయిన ఉప్పు ఉత్పత్తి
- ఉపాధి కోల్పోయిన మూడు గ్రామాల్లోని రెండు వేల కుటుంబాలు
- ప్రభుత్వం అనుమతులు ఇస్తేనే మళ్లీ పనులు ప్రారంభిస్తామంటున్న యాజమాన్యం


బందరు మండలం పల్లెతుమ్మలపాలెంలో నడుస్తున్న భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలో దశాబ్దాల కిందట భారత్ సాల్ట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. ఈ కంపెనీకి నాడు ప్రభుత్వం 6,500 ఎకరాలను లీజుకు ఇచ్చింది. ఇక్కడ ఏటా డిసెంబరు నుంచి జూన్, జూలై వరకు ఉప్పు ఉత్పత్తి, రవాణా తదితర పనులను చేస్తూ ఉంటారు. తీర ప్రాంతంలోని పల్లెతుమ్మలపాలెం, కోన, పోలాటితిప్ప గ్రామాలకు చెందిన రెండు వేల మంది ఇక్కడ పనిచేస్తూ గత 24 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారు. కూలీలకు ఏటా రూ.5 కోట్ల వరకు కూలీగా కంపెనీ వారు చెల్లిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ వచ్చాకే ఈ గ్రామాల ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో లీజు గడువు ముగిసిందని, సాల్ట్ ఫ్యాక్టరీ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని నోటీసులు జారీ చేశారు. దీంతో ఉప్పు ఉత్పత్తి పనులు ప్రారంభించడానికి కొంత ఆలస్యం జరిగింది. రెండేళ్ల పాటు డిసెంబర్‌లో చేపట్టాల్సిన పనులు మార్చిలో ప్రారంభించారు. 2024 ఎన్నికల సంవత్సరం కావడంతో ఫ్యాక్టరీని మూసి వేయిస్తే రాజకీయంగా పార్టీకి ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంతో ఎట్టకేలకు అప్పటి వైసీపీ నాయకులు పనులు ప్రారంభింపజేసి ఫ్యాక్టరీ కొనసాగుతుందనే భ్రమను ప్రజల్లో కల్పించారు.

పనులు ప్రారంభించాలని స్థానికుల డిమాండ్

భారత్ సాల్ట్ ఫ్యాక్టరీలో పనిచేసే కూలీలు ఒక్కొక్కరికి కనీసంగా రోజుకు వెయ్యి రూపాయల చొప్పున కూలీగా వచ్చేది. ఒక కుటుంబంలో భార్యభర్తలు ఇద్దరూ పనిచేస్తే కనీసంగా నెలకు రూ.60 వేలకు తక్కువ కాకుండా సంపాదించుకునేవారు. ఈ ఏడాది పనులు లేకపోవడంతో తమకు ఉపాధి లేకుండా పోయిందని, ఈ ఫ్యాక్టరీ ఉప్పు ఉత్పత్తి పనులు వెంటనే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతులు వస్తేనే.. వచ్చే ఏడాదికైనా పనులు ప్రారంభిస్తామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

» ఈ ఏడాది నేటికీ ప్రారంభం కాని పనులు

గత వైసీపీ ప్రభుత్వం భూములను అప్పగించాలని పలుమార్లు నోటీసులు జారీ చేయడంతో పనులు ప్రారంభించాలా! వద్దా అనే మీమాంసలో కంపెనీ యాజమాన్యం ఆచితూచి వ్యవహరిస్తూ

మిగతా 6లో..

పోర్టు అనుబంధ పరిశ్రమలకు సాల్ట్ భూములు!

ప్రస్తుతం బందరు పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి భారత్ సాల్ట్ కంపెనీకి ప్రభుత్వం లీజుకు ఇచ్చిన 6,500 ఎకరాల్లోని మూడు వేల ఎకరాలను ఇస్తామని అధికారులు చెబుతున్నారు. సముద్రానికి, కరకట్టకు మధ్యలో ఉన్న భూముల్లో భారత్ సాల్ట్ కంపెనీ వారు ఉప్పు ఉత్పత్తిని చేస్తున్నారు. సాల్ట్ ఉత్పత్తికి అనుగుణంగా ఇక్కడ 20 అడుగులకు పైగా లోతున చెరువులను తవ్వి, వాటిలో సముద్రపు నీటిని నిల్వ ఉంచి, ఆ తర్వాత ఉప్పు ఉత్పత్తికి ఈ నీటిని వినియోగిస్తారు. ఇటీవల ఈ భూముల్లో ఆయిల్ రిఫైనరీని ఏర్పాటు చేస్తామనే ప్రతిపాదనలు వచ్చాయి. ఇక్కడి భూములను పరిశీలించిన నిపుణులు రూ.60 వేల కోట్లతో నిర్మాణం చేసే ఆయిల్ రిఫైనరీకి ఈ భూములు పనికిరావని తేల్చారు. దీంతో ఈ ఆయిల్ రిఫైనరీ రాష్ట్రంలోని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఉప్పు ఉత్పత్తికి మినహా మరే ఇతర పరిశ్రమలకు పనికి రాని భూములను పారిశ్రామికవేత్తలకు ఇస్తామని అధికారులు నేటికీ చెప్పడం గమనార్హం.



పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైనికులు జరిపిన దాడులకు మద్దతుగా నాగాయలంక సెంటరులో వంద అడుగుల జాతీయ జెండాతో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా నిలబడి జై సిందూర్, భరతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. -(ఆంధ్రజ్యోతి- నాగాయలంక)

తీరంలో పోలీస్ నిఘా



పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైనికులు దాడులు జరిపిన నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉగ్రవాదుల అక్రమ చొరబాట్లను నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆధ్వర్యంలో మచిలీపట్నం తీరంలో బుధవారం పోలీస్ నిఘా పెంచారు.

11 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్

6లో

గ్యారేజీల్లో డొల్లతనం!

తనిఖీలకు నోచుకోని ఆర్టీసీ బస్సులు

రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎన్టీఆర్, కృష్ణా రీజియన్ల పరిధిలోని గ్యారేజీల పనితీరుపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్సుల కండీషన్‌ను మెరుగుపర్చేందుకు అమలు చేయాల్సిన షెడ్యూల్స్ 1, 2, 3, 4, 5ను ఉద్యోగులు గాలికి వదిలేస్తున్నారు. దీంతో తనిఖీలకు నోచుకోని బస్సులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మొరాయిస్తున్నాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, బ్యాటరీలు పనిచేయకపోవటం, ప్రమాదాలకు గురి కావటం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

- » షెడ్యూల్స్ 1, 2, 3, 4, 5 అమలులో తీవ్ర నిర్లక్ష్యం
- » వేధిస్తున్న స్పేర్ పార్ట్స్ కొరత!
- » మొక్కుబడిగా సీఎంఈ చెకింగ్
- » కండీషన్‌లో లేని బస్సులతో ప్రయాణికుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి జిల్లాలో విజయవాడ, జగ్గయ్యపేట, తిరువూరు, ఇబ్రహీంపట్నం, గవర్నర్ పేట-1, గవర్నర్‌పేట-2, విద్యాధరపురం, ఆటోనగర్, గన్నవరం, ఉయ్యూరు, గుడివాడ, అవనిగడ్డ, మచిలీపట్నం బస్ డిపోల పరిధిలోని గ్యారేజీ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్యారేజీ నుంచి రోడ్డు మీదకు వెళ్లి తిరిగి గ్యారేజీలకు వచ్చిన బస్సులను పరీక్షించటానికి ఐదు షెడ్యూల్స్‌ను గ్యారేజీ విభాగం నిర్వహించాల్సి ఉంటుంది. షెడ్యూల్ - 1, 2, 3, 4, 5 అనేవి క్రమం తప్పకుండా నిర్వహిస్తేనే ఆ బస్సు కండీషన్ బాగుంటుంది. బయట ఎక్కడ పడితే అక్కడ ఆగిపోవటం, మొరాయించటం, అంతర్గత ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్స్, బ్యాటరీలు దిగిపోవటం వంటివి జరగవు. కానీ ఇప్పుడు ఆర్టీసీ బస్సులను చూస్తుంటే ఎక్కడ ఆగిపోతాయో ఎవరికీ తెలియదు. బస్సులు ఆగిపోతే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. దూర

మిగతా 6లో..

షెడ్యూల్స్ అమలు ఇలా..

- గ్యారేజీల్లో షెడ్యూల్స్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలి.

షెడ్యూల్-1 : బస్సు గ్యారేజీ నుంచి బయటకు వెళ్లి తిరిగి గ్యారేజీకి వచ్చిన వెంటనే దానిని పిట్ మీదకు ఎక్కించి ప్రతి అంశాన్ని చెక్ చేసి ఏమైనా సమస్యలు గుర్తిస్తే వాటిని సరిచేయాల్సి ఉంటుంది.

షెడ్యూల్-2 : ప్రతి వారం బస్సుల ఎయిర్ క్లీనర్ చెక్ చేసి మార్చాలి. ఆయిల్స్ చెక్ చేసి కొరత ఉంటే నింపాలి. గ్రీజు పెట్టాలి. వీటితో పాటు షెడ్యూల్ - 3లో చేసే పనులు కూడా చేయాల్సి ఉంటుంది.


ఆర్టీసీ బస్సు నుంచి వెలువడుతున్న పొగ

షెడ్యూల్ - 3 : ప్రతి 3 నెలలకు లేదా 20 వేల కిలోమీటర్లు తిరిగిన ప్రతి బస్సును కూడా పూర్తిగా తనిఖీ చేయాలి. ఇంజిన్‌ను పరీక్షించాలి. ఇంజిన్ వాల్వ్ పనితీరును గుర్తించాలి. బ్రేకులను పరీక్షించాలి. క్లచ్ ప్లేట్ల మందాన్ని అంచనా వేసి మార్చాలి.

షెడ్యూల్-4: బస్సు 60 వేల కిలోమీటర్లు తిరిగిన ప్రతిసారీ కూడా ఇంజిన్ టెస్ట్ నిర్వహించాలి. గేర్ బాక్స్ సిస్టమ్‌ను పరిశీలించి అవసరమైతే కొత్తది ఏర్పాటు చేయాలి. క్లచ్ ప్లేట్స్ ఖచ్చితంగా మార్చాలి. ఇంజిన్ వాల్వ్ ఇతర అన్నింటినీ పరిశీలించాల్సి ఉంటుంది.

షెడ్యూల్-5: ఏటా ఒకసారి పూర్తి వాహన తనిఖీ చేయాలి.

దారి తప్పింది..!



విజయవాడ వెస్ట్ బైపాస్‌లో మారిన అలైన్‌మెంట్

- » వైసీపీ హయాంలో వెంకటపాలెంలో జరిగిన తప్పిదం
- » ఎన్-6లో అలైన్‌మెంట్ మారడం వల్ల రూ.100 కోట్ల భారం
- » ఏడు కిలోమీటర్ల మేర భూగర్భ పైల్స్, పిల్లర్ల పనులు
- » ఆ తర్వాత తెలుసుకుని యథాతథ స్థితికి మళ్లీ మార్పు
- » కూటమి ప్రభుత్వంపై అదనపు భారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4లో 7 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్ మారటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై రూ.100 కోట్ల మేర భారం పడింది. ఎన్-6 మార్గంలో వెళ్లాల్సిన అలైన్‌మెంట్ కాస్త ఎగువకు వెళ్లడంతో ఈ నష్టం జరిగింది. ఏడు కిలోమీటర్ల మేర 15 శాతం పనులు చేశాక మళ్లీ ఎన్-6 మార్గంలో రోడ్డును అభివృద్ధి చేశారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అలైన్‌మెంట్ మార్చినందుకు కూటమి ప్రభుత్వంపై రూ.100 కోట్ల భారం పడే పరిస్థితి ఏర్పడింది.

తప్పు జరిగింది ఇలా..

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4లో ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి ఎన్-6 రోడ్డు మీదుగానే అలైన్‌మెంట్‌ను నిర్దేశించారు. దాదాపు 7 కిలోమీటర్ల మేర ఈ మార్పు జరిగింది. 7 వేల మీటర్ల పొడవు, 70 మీటర్ల వెడల్పు అంటే.. 130 ఎకరాల ప్రభుత్వ భూమిలో పనులు చేపట్టారు. ఏకంగా 7 కిలోమీటర్ల పాటు అలైన్‌మెంట్ మారినా ఎవరికీ తెలియలేదు. ఎందుకంటే.. రాజధాని కోసం ఈ ప్రాంతంలో రైతులు అంతకుముందు టీడీపీ ప్రభుత్వానికి భూములిచ్చి ఉన్నారు. అలైన్‌మెంట్ మారిన భూమి కూడా భూ సమీకరణలోనే ఉంది. దీంతో ఎవరికీ తెలియలేదు. అయితే, ఈ మారిన అలైన్‌మెంట్ ఎన్-6 మార్గంలో కాకుండా కాస్త ఎగువన ఎందుకు చూపించారన్నది అర్థంకాని విషయంగా

మిగతా 6లో..



వెంకటపాలెం వద్ద వెస్ట్ బైపాస్ పరిస్థితి ఇది. పసుపు రంగు గీత మారిన అలైన్‌మెంట్, ఎరుపు రంగు గీత అసలు అలైన్‌మెంట్ (ఇన్‌సెట్‌లో) మధ్యలోనే వదిలేసిన పిల్లర్లు

ఉపగ్రహ చాయాచిత్రాల్లో స్పష్టత

క్షేత్రస్థాయిలో అలైన్‌మెంట్ మారిన విషయం వెంకటపాలెం వాసులకు మినహా ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. అలైన్‌మెంట్ ఏ విధంగా మారిందన్నది ఉపగ్రహ చాయాచిత్రాల్లో స్పష్టంగా తెలుస్తోంది. 2021లో అలైన్‌మెంట్ మారగా, 2023, మే 23 నాటికి అసలు అలైన్‌మెంట్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం రాజధాని పనుల నేపథ్యంలో భూములను చదును చేస్తున్నారు. ఆర్వోబీలు, అండర్ పాస్‌లకు వేసిన పిల్లర్లను పెకిలిస్తున్నారు. ఈ పిల్లర్లు ఉన్నచోట నీరుకొండ రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ కోసం భూమిలో వేసిన పైల్స్‌తో సహా తొలగిస్తుండటంతో విషయం బయటకు వచ్చింది.



కృష్ణా తీరాన డబుల్ ధమాకా!

- వీకెండ్స్‌లో పర్యాటకులకు వినోదం.. ఉల్లాసం
- బోధిసిరి క్రూయిజర్ వేదికగా ప్రత్యేక ప్యాకేజీ
- ఆటా.. పాటా, మ్యూజిక్.. మ్యాజిక్, మస్తు మజా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వారాంతాల్లో.. సాయం సంధ్య వేళ.. బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్‌పై కృష్ణాతీరంలో ఆనందంగా గడిపేందుకు సరికొత్త టూర్ ప్యాకేజీకి రంగం సిద్ధమౌతోంది. త్వరలో టూర్ ప్యాకేజీ అమలుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉన్నతాధికారులు సన్నద్ధమౌతున్నారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఏపీటీడీసీ ఎండీ ఆమరపాలి, చైర్మన్ నూకసాని బాలాజీల ఆదేశాల మేరకు ఈడీ పద్మావతి నేతృత్వంలో సరికొత్త ఆలోచనలు చేస్తున్నారు. దీనిలో భాగంగా రాజధాని చెంతనే ఉన్న కృష్ణానది కేంద్రంగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. 'క్రూయిజ్ ఫన్' రూపంలో విజయవాడ డివిజన్ అధికారులు ప్యాకేజీకి రూపకల్పన చేస్తున్నారు. బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్ వేదికగా ఫన్ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. బోధిసిరిపై భాగంలో ఓపెన్ స్టేజీపై మ్యూజికల్‌నైట్, డ్యాన్సులు, మ్యాజిక్ షోలతో పాటు అనేక ఫన్ గేమ్స్‌ను చేర్చనున్నారు. యాంకర్లతో ఫన్ ఈవెంట్ నిర్వహిస్తారు. సాయంత్రం మంచి స్నాక్స్‌తో పాటు అరకు కాఫీని పర్యాటకులకు అందించేందుకు ప్లాన్ చేశారు. ప్యాకేజీ ధర ఒకరికి రూ.250 నుంచి రూ.300 ఉంటుంది. హరిత బెర్మ్‌పార్క్ వద్ద బోటింగ్ పాయింట్‌లో 'ఫన్ క్రూయిజ్' టిక్కెట్ తీసుకుంటే బోధిసిరిలోకి ఎక్కవచ్చు. సుమారు రెండు గంటల పాటు నదీ విహారం ఉంటుంది. భవానీఘాట్ నుంచి ప్రారంభమయ్యే క్రూయిజర్ ప్రకాశం బ్యారేజీ, భవానీ ఐల్యాండ్ వెంబడి సాగుతూ ఎగువకు వెళ్లి మళ్లీ తిరిగి భవానీ ఐలాండ్ ఘాట్‌కు వస్తుంది. సుమారు గంట నుంచి రెండు గంటల పాటు క్రూయిజర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.




పెండ్లి కుమారుడిగా లక్ష్మీనారసింహుడు

- వైభవంగా వేదాద్రి లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు



జగ్గయ్యపేట రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాల్లో పంచ నారసింహ క్షేత్రంగా పేరొందిన వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తిరుక్కల్యాణ బ్రహ్మోత్సవాలకు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు వేదాంతం వంశీకుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో సురేష్‌బాబు, వంశపారంపర్య ధర్మకర్త తరపున సిబ్బంది పాల్గొన్నారు.


వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం

క్షేత్ర పురాణం..

వేదాద్రి క్షేత్రంపై స్వామివారు ఐదు రూపాల్లో కొండపైన జ్వాలా నరసింహ, కృష్ణానదిలో సాలగ్రామ నరసింహ, గరుడాచలంలో వీర నారసింహ, కొండ కింద ఆలయంలో నిత్య పూజలందుకునే యోగానంద, లక్ష్మీనారసింహ స్వామిగా దర్శనమిస్తుంటారు. స్వామివారి కల్యాణం అనంతరం నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా గరుడపట ప్రతిష్ఠ నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. సంతానం లేని దంపతులు గరుడస్వామికి నివేదించిన ప్రసాదం తీసుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. సంతానం లేని దంపతులు ముందురోజు రాత్రి జరిగే స్వామివారి కల్యాణాన్ని వీక్షించి నిద్ర చేసి తెల్లవారుజామున పవిత్ర కృష్ణానదిలో స్నానం చేసి గరుడ ప్రతిష్ఠ అనంతరం ప్రసాదం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవాలను బాలాత్రిపుర సుందరీ ట్రస్ట్, కేసీపీ సంస్థ సమన్వయంతో నిర్వహిస్తున్నారు. వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ స్వీయ పర్యవేక్షణలో కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈవో సురేష్‌బాబు తెలిపారు. కళ్యాణోత్సవాల్లో గురువారం అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, శుక్రవారం శేషవాహన సేవ, శనివారం హనుమంతు సేవ, ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు స్వామి, అమ్మవారికల్యాణోత్సవం నిర్వహిస్తారు. 12న గరుడోత్సవం, చక్రతీర్థం, పూర్ణాహుతి, ధ్వజారోహణ, 13, 14న పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయని ఈవో తెలిపారు.


బోళ్లపాడులో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న జర్మనీ బృందం

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శించిన జర్మనీ బృందం

ఉయ్యూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మండలం బోళ్లపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జర్మన్ ప్రభుత్వ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ దక్షిణాసియా డైరెక్టర్ కారోలిన్ గాస్నర్ బృందం బుధవారం సందర్శించింది. గ్రామానికి చెందిన సి.మోహన్‌రావు వ్యవసాయక్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి నేతృత్వంలో సందర్శించి ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలపై ఏర్పాటుచేసిన చక్రంను పరిశీలించారు. అనంతరం మోహన్‌రావుకు చెందిన అరటి ఏ గ్రేడ్ వ్యవసాయ క్షేతం సందర్శించి ప్రకృతి వ్యవసాయ సూత్రాలను, అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. రసాయన వ్యవసాయ క్షేత్రాన్ని కూడా సందర్శించిన బృందం రెండింటికి గల తేడా గమనించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో జర్మన్ బృందం వివిధ సమూహాలతో చర్చించింది. ఈ సందర్భంగా కారోలిన్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ అమలులో మహిళలు మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ నేలతల్లి సేవలో తరించడం అభినందనీయమన్నారు. రైతుసాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్‌లు తరు, సుధాకర్, సురేశ్, వ్యవసాయశాఖ గన్నవరం ఏడీఏ సునీల్, ఏఓ నిస్సీగ్రే స్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అదనపు మేనేజర్ నాగమల్లీశ్వరి, ఎంపీటీసీ గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ పట్ల దేశం గర్విస్తోంది : సుజనా

వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పెహల్గాం ఉగ్ర దాడికి ప్రతిగా మంగళవారం అర్ధరాత్రి భారత త్రివిధ దళాలు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాదుల శిబిరాలపై ఆపరేషన్ సిందూర్ మన సైనిక బలగాల దృఢ సంకల్పానికి నిదర్శనమన్నారు. తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన సైనిక దళాల శక్తిసామర్థ్యాల పట్ల దేశం గర్విస్తున్నదని ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు

రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు అవార్డుల ప్రదానంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

మచిలీపట్నం/వన్‌టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. తుమ్మలపల్లిక్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ, గిరిజన, గురుకులాలు వసతి గృహాల విద్యార్థులు పది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందచేత బుధవారం జరిగింది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి మంత్రి బాల వీరాంజనేయస్వామి విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన సాంఘిక సంక్షేమ గిరిజన గురుకులాలు, వసతి గృహాలు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందించటం ఇదే తొలిసారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ ఫలితాలు రావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. పేద విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. సంధ్యారాణి మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు వర్ధంతి రోజున గిరిజన విద్యార్థులకు అవార్డులివ్వటం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 315 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, 34 మంది మెరిట్ విద్యార్థులు నగదు పురస్కారాలు అందజేసినట్టు తెలిపారు. మొదటి బహుమతి రూ.20వేలు, 2వ బహుమతి రూ.15వేలు, 3వ బహుమతి రూ.10వేలు నగదు రూపంలో అందించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాధించిన ఫలితాలు, గణాంకాలను ఆమె వివరించారు. అనంతరం 36 మంది ఉద్యోగులు, టీచర్లను సత్కరించారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శి ఎస్.ఎం.నాయక్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయాలు భవిష్యత్తుతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. సాంఘిక సంక్షేమ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్, డైరెక్టర్ లావణ్య వేణి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి జి.గౌతమి, డైరెక్టర్ ఎస్.భార్గవి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, వార్డెన్లు పాల్గొన్నారు.


విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గుమ్మడి సంధ్యారాణి

11 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్

- మంత్రి వాసంశెట్టి సుభాష్

పామర్రు, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమల స్థాపనకు నిధులు కేటాయించామన్నాని అందులో భాగంగా పామర్రు నియోజకవర్గంలో 11 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణం చేస్తున్నట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పామర్రు నియోజకవర్గ పరిధిలోని ఐనంపూడిలోని 11 ఎకరాల ప్రభుత్వ భూమిలో నూతనంగా నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి బుధవారం మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి మంత్రి వాసంశెట్టి సుభాష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు పరిధిలోని ఐనంపూడి గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో రూ.11.2 కోట్ల నిధులతో నిర్మితమయ్యే ఎంఎస్ఎంఈ పార్క్‌కు తన చేతుల మీదుగా శ్రీకారం చుట్టడం గర్వంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం యూనిట్ నిర్మాణంలో 70 శాతం రాయితీనిచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. ఎక్సైజ్, భూగర్భగనుల శాఖ మంత్రి కొ ల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విప్లవానికి తమ ప్రభుత్వం నాంది పలకడం శుభపరిణామమని ఉద్యోగాలిచ్చే సాయికి యువతను తీర్చిదిద్దే విజన్‌లో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. గత వైసీపీ అరాచక పాలనలో రాష్ట్ర ప్రగతి ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. కుట్రపూరితంగా భూముల్ని లాక్కోవడంతో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. ప్రజల ఆదరణతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పారిశ్రామిక రంగం చిగురించి పురోభివృద్ధికి అడుగులు పడ్డాయన్నారు. గతంలో ఇక్కడే నిమ్మలూరు గ్రామానికి బందరు బెల్ కంపెనీ తరలింపులో చంద్రబాబు చొరవను గుర్తుచేశారు. త్వరలోనే గేట్‌వే ఆఫ్ అమరావతిగా బందరు పోర్టు నోచుకోనుందన్నారు. పోర్టు ఆధారిత పరిశ్రమలను బందరులో ఏర్పాటుకు సీఎం హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ గత పాలకులు ఐదేళ్ల పాలనలో ఆలోచన చేయలేని పనులను కేవలం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు మార్చడంతోపాటు వాటిని అభివృద్ధి చేసి చేపిస్తోందన్నారు. ఈ క్రమంలో జిల్లాలోనే తొలిసారిగా పామర్రు నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమల హబ్‌ను ఏర్పాటు చేయడం గర్వకారణంగా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను పోత్సహించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే పథకాలు వివరించడంతోపాటు వాటిని సద్వినియోగం చేసుకుని మరింతమందికి ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ బట్టు పరంజ్యోతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పీ బాబ్జి తహసీల్దార్ జీ రవికాంత్, ఎంపీడీవో కే జ్యోతి, కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండలాధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఐనంపూడి మాజీ సర్పంచ్ బొప్పన భరత్, మృదుల కొమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాస్, పాల్గొన్నారు.


ఐనంపూడిలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖకు భూముల బదలాయింపులో పాల్గొన్న మంత్రులు సుభాష్, రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, జేసీ గీతాంజలీశర్మ

అనుకూల కూలీలతో విచారణ..!

- వేలిముద్రలు వేసిన ఎఫ్ఏకి మద్దతుగా హడావిడి
- వార్త ఎందుకు రాశారంటూ విలేకరులపై రుసరుస

తోట్లవల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీల వేలిముద్రలు వేసిన ఎఫ్ఏ కిరణ్‌కుమార్ ఉదంతంపై విచారణకు బుధవారం కృష్ణాజిల్లా ఎంఎన్ఆర్‌జీఎస్ అంబుడ్స్‌పర్సన్ కేవీ శ్రీనివాసరావు భద్రిరాజుపాలెం గ్రామ పంచాయతీకి వచ్చారు. 'దర్జాగా ఫోర్జరీ' శీర్షికతో ఎఫ్ఏ వేలిముద్రల తంతుపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించి విచారణకు శ్రీనివాసరావు రాగా ఎఫ్ఏ కిరణ్‌కుమార్ తనకు అనుకూలమైన ఉపాధిహామీ కూలీలను పంచాయతీకి రప్పించారు. వారం రోజుల్లో పనిచేసిన కూలీలు ఒకవైపునకు రావాలని శ్రీనివాసరావు సూచించారు. దీంతో ఎఫ్ఏ అనుకూల కూలీలు ఓ పక్కకు వచ్చారు. వారితో సంతకాలు, వేలిముద్రలు చేయించుకున్నారు. బ్లూషీట్‌లోని కూలీల సంతకాలు, వేలిముద్రలను, ప్రస్తుతం తీసుకున్న సంతకాలను పోల్చి చూస్తానని, రెండు చోట్ల సంతకాలు ఒకేరకంగా ఉంటే ఎఫ్ఏ కిరణ్‌కుమార్ తప్పు చేయనట్లని, అప్పుడు మీరు రాసిన వార్త తప్పవుతుందని అంబుడ్స్‌పర్సన్ శ్రీనివాసరావు బహిరంగంగా వ్యాఖ్యానించారు. దీంతో విలేకరులు కల్పించుకుని మండల పరిషత్ కార్యాలయంలో కిరణ్‌కుమార్ వేలిముద్రలు వేశాడని, తాము వీడియోలు తీశామని, మేట్ నిశాని సంతకాలు రాస్తే తానే వేలిముద్రలు వేస్తున్నట్టు అంగీకరించాడని, దీనిపై ఎంపీడీవో రవికాంత్ కూడా ఎఫ్ఏను మందలించాడని, ఆ బ్లూషీట్ కాగితాలు చింపేసి మళ్లీ ఇంటింటికీ తిరిగి సంతకాలు తీసుకోమని చెప్పారని, ఇంత రుజువుంటే తాము రాసిన వార్త ఎలా తప్పవుతుందని అంబుడ్స్‌పర్సన్ శ్రీనివాసరావును అడగడంతో ఎఫ్ఏ కిరణ్‌కుమార్ అనుకూల కూలీలు ఎందుకు వార్త రాశారంటూ విలేకరులపై రుబాబు చేశారు. ఎఫ్ఏ కిరణ్‌కుమార్ అధికార పార్టీ నేతల అండదండతో ఈ తతంగమంతా నడిపించాడనే ఆరోపణలు వినిపించాయి. ఈ విచారణలో గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, ఉపాధిహామి టీఏ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


భద్రిరాజుపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కూలీలతో సంతకాలు తీసుకుంటున్న అంబుడ్స్‌పర్సన్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికాంత్, సర్పంచ్ హేమలత


తోట్లవల్లూరు లంకలో సుడిగాలికి పడిపోయిన అరటితోట

సుడిగాలి బీభత్సం

- తోట్లవల్లూరులో విరిగిన కరెంటు స్తంభాలు
- నేలకొరిగిన అరటి, మొక్కజొన్న తోటలు

తోట్లవల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి 9 గంటల సమయం లో సుడిగాలి విరుచుకుపడింది. తుఫాన్ మాదిరిగా బలమైన గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో లంకల్లో అరటి తోటలు, మొక్కజొన్న తోటలు పడిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న పంట తడిసిపోయింది. రొయ్యూరు, వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక, తోట్లవల్లూరులో 30 కరెంటు స్తంభాలు విరిగిపోయాయని విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు. అనేకచోట్ల చెట్లు వేళ్లతో సహా పడిపోయాయి.


వల్లూరుపాలెంలో విరిగిన కరెంటు స్తంభాలు

డిజైన్లు, డ్రాయింగ్‌లు లేకుండా పనులు చేపట్టవద్దు

- ఎస్ఏబీసీఏ అధ్యక్షుడు విజయకుమార్

విజయవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): సరైన డిజైన్లు, డ్రాయింగ్‌లు లేకుండా పనులు చేపట్టవద్దని సబ్కా (స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కంట్రాక్టర్స్ అసోసియేషన్) అధ్యక్షుడు ఎస్.విజయకుమార్ బుధవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మాణ విషయాల్లో ఒత్తిడి ఎదురైతే సభ్యులు వెంటనే సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు ఆర్ అండ్ ఆర్ కాంట్రాక్టర్లకు ధరల విషయంలో చేసుకున్న ఒప్పందాల రద్దుపై తీసుకున్న నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి వివరణ ఇవ్వలేదన్నారు. ఆర్థిక శాఖ కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టిన తరువాత ఎస్ఏబీసీఏలో అనేక సమస్యలు ఏర్పడ్డాయన్నారు. ఈఆర్‌పీ ఆధారంగా బడ్జెట్ ప్రకియను పాటించని మున్సిపాలిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.


అన్యాక్రాంతమైన భూమిని స్వాధీన పరుచుకున్న దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి యూవీ ప్రసాద్‌రావు

అన్యాక్రాంతమైన దేవదాయ భూమి స్వాధీనం

కంకిపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో అన్యాక్రాంతమైన దేవదాయ శాఖకు సంబంధించిన భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఈవో యూవీ ప్రసాద్‌రావు తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈడుపుగల్లురున్న పర్వతనేని వారి ధర్మ చెరువుకు సంబంధించిన సుమారు 11.19 ఎకరాల భూమి ఉందన్నారు. అనేక ఏళ్లు ఈ భూమిని అన్యాక్రాంతం చేసి వినియోగించుకుంటున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 11.19 ఎకరాల ధర్మ చెరువుకు ఈ నెల 16న అధికారికంగా వేలంపాట నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆశావహులు పాల్గొనవచ్చని తెలిపారు.

ఎంపీ వల్లభనేనిని కలిసిన మంగళగిరి ఎయిమ్స్ ఈడీ


ఎంపీ వల్లభనేనితో మాట్లాడుతున్న మంగళగిరి ఎయిమ్స్ ఈడీ

మచిలీపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎంపీ వల్లభనేని బాలశౌరిని మంగళగిరి ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతాసింగ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరులోని ఎంపీ నివాసానికి వెళ్లిన ఆయన మంగళగిరి ఎయిమ్స్‌లో అందిస్తున్న వైద్యసేవలు, కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతరత్రా అంశాలను వివరించారు. అందుబాటులోని వనరులను అందిపుచ్చుకుని వివిధ వైద్య సేవలకు ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన సేవలందించాలని ఎంపీ సూచించారు.


ఆశాలతకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

మెడికల్ సర్టిఫికెట్లు విడుదల చేయాలి

మచిలీపట్నం టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రిపరెన్షియల్ క్యాటగిరీ ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డీ ఆశాలతకు యూటీఎఫ్ నేతలు వినతిపత్రం ఇచ్చారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య, జిల్లా సహాధ్యక్షుడు ఎం కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి హరిప్రసాద్, జగయ్యపేట మండలాధ్యక్షుడు నరసింహారావు పాల్గొన్నారు.

గ్యారేజీల్లో డొల్లతనం!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాలకు వెళ్లే హై ఎండ్ బస్సులైన సూపర్ లగ్జరీ, ఇంద్ర, అమరావతి, వెన్నెల, స్లీపర్ వంటి బస్సులు కూడా ఆగిపోతుండటం, మొరాయించటం చూస్తే షెడ్యూల్స్ మాల్‌ప్రాక్టీస్ ఏ స్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.

చేయకపోయినా.. చేసినట్టుగా చూపి..

బస్సులకు విధిగా నిర్వహించాల్సిన షెడ్యూల్స్‌ను చేయకుండానే చేసినట్టుగా చూపిస్తున్నారు. షెడ్యూల్స్ చెకింగ్ రిజిస్టర్స్ ఇతర రికార్డుల్లో జరిగిపోయినట్టుగా చూపిస్తున్నారు. బస్సులను చెక్ చేయకుండానే షెడ్యూల్స్ జరిగినట్టుగా చూపటం వల్ల మాల్ ప్రాక్టీస్ జరుగుతోంది. ఈ మాల్ ప్రాక్టీసు వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆర్టీసీకి కూడా నష్టం జరుగుతోంది.

అందుబాటులో లేని స్పేర్ పార్ట్స్

గ్యారేజీల్లో స్పేర్ పార్ట్స్ కొరత వేధిస్తోంది. తగిన విధంగా ఆయిల్ అందుబాటులో లేదు. టూల్స్ లేవు. బస్సుల కనీస మెయింటెనెన్స్‌కు సంబంధించి స్పేర్ పార్ట్స్ కూడా లేకపోవడంతో దీన్ని సాకుగా తీసుకుని గ్యారేజీల ఉద్యోగులు షెడ్యూల్స్‌ను సక్రమంగా నిర్వహించటం లేదు. ఆర్టీసీ బస్సులకు నిర్ణీత సమయంలో షెడ్యూల్స్ నిర్వహిస్తున్నారా లేదా అన్నది పరిశీలించటానికి వీలుగా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (సీఎంఈ) క్రమం తప్పకుండా డిపోలకు వచ్చి తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. వీరు గ్యారేజీలకు వచ్చినా స్పేర్ పార్ట్స్ కొరతను దృష్టిలో పెట్టుకుని ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సీఎంఈ స్థాయి అధికారులు కూడా పట్టించుకోక పోవటం వల్ల షెడ్యూల్స్ మాల్ ప్రాక్టీస్ మరింతగా పెరిగిపోతోంది.

దారి తప్పింది..!

(5వ పేజీ తరువాయి)

ఉంది. అలైన్‌మెంట్‌ను నిర్దేశించే విషయంలో ఎన్‌హెచ్ అధికారులు అక్షాంశ, రేఖాంశాలను గుర్తించలేకపోయారని తెలుస్తోంది. విద్యుత్ శాఖ టవర్ల కోసం వేసిన పెగ్ మార్కింగ్‌ను బేస్ చేసుకోవడం వల్లే అలైన్‌మెంట్ తప్పిందనే విమర్శలు వస్తున్నాయి. దీంతో 7 కిలోమీటర్ల పరిధిలో ఈ-11, ఎన్-6 జంక్షన్లలో ఆర్వోబీల కోసం పనులు పిల్లర్ల వరకూ వెళ్లాయి. 4 కిలోమీటర్ల మేర డ్రెయిన్ల నిర్మాణ పనులు కూడా చేపట్టారు. ఈ పనుల విలువ దాదాపు రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని తెలుస్తోంది. అయితే, ఈ తప్పిదాన్ని ఎన్‌హెచ్ అధికారులు నాటి వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. తిరిగి ఎన్-6 రోడ్డులోనే పనులు చేసుకోవాలని నాటి ప్రభుత్వం నిర్దేశించటంతో మళ్లీ ఆ మార్గంలో పనులు చేపట్టారు. అమరావతిలోని వెంకటపాలెంలో కృష్ణానది బ్రిడ్జికి అనుసంధానంగా సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి తిరిగి కొత్తగా పనులు చేపట్టాల్సి వచ్చింది. అప్పటికే చేసిన పనికి జరిగిన నష్టాన్ని తామే చెల్లిస్తామని నాటి వైసీపీ ప్రభుత్వం అంగీకరించిందని జాతీయ రహదారుల సంస్థ అధికారులు చెబుతున్నారు. దీని ప్రకారం ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ఈ భారం పడనుంది. అయితే, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సన్నిహిత సంబంధాలు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షం కావటంతో రూ.100 కోట్ల భారానికి మినహాయింపు ఇవ్వాల్సిందిగా కోరే అవకాశం ఉంది.

ప్రశ్నార్థకం!

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. ఫ్యాక్టరీలోకి సముద్రపు నీరు చొచ్చుకు రాకుండా నిర్మాణం చేసిన కరకట్టకు గత ఏడాది డిసెంబరు నెలలో సంభవించిన తుఫాను కారణం పలుచోట్ల గండ్లు పడ్డాయి. ఈ గండ్లను పూడ్చేందుకు రూ.3.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉండటంతో కంపెనీ యాజమాన్యం ఈ గండ్లను పూడ్చకుండా వదిలేసింది. మే నెల వరకు ఈ పనులు చేయకపోవంతో ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి పనులు ప్రారంభం కాలేదు. దీంతో 3 గ్రామాల ప్రజలకు ఈ ఏడాది పనిలేకుండా పోయింది. మచిలీపట్నంలో ఉన్న ఒక్క పరిశ్రమ భారత్ సాల్ట్ కంపెనీ. అది ఈఏడాది పనులే ప్రారంభించకపోవడంతో ఫ్యాక్టరీ కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు వస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

డ్రగ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన అవసరం: ఎస్పీ

గంగూరు (కంకిపాడు), మే 7 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన అవసరమని కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. పెనమలూరు మండలం ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహ న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ, యువత మత్తు మందులకు బానిసలుగా మారుతున్నారన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత కొరవడు తుందన్నారు. డ్రగ్స్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగిస్తున్నట్లు సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వరాజ్యలక్ష్మి, యు. శ్రీనివాసరావు, డి. సుబ్బా రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పోరంకి ఆరో డివిజన్ కమిటీ ఎంపిక

పెనమలూరు, మే7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ తాడిగడప మునిసిపాలిటీ డివిజన్ల ఎంపికలో భాగంగా బుధవారం పోరంకి ఆరో డివిజన్ కమిటీని ఎంపిక చేశారు. పార్టీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర రావు అధ్యక్షతన జరిగిన ఈ ఎంపికలో డివిజన్ అధ్యక్షుడిగా తిరిగి యాళ్ల చక్రవర్తి ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చెన్నుపాటి శ్రీనివాస్, కోశాధికారిగా కొరివి రవి, ఉపాధ్యక్షుడిగా పోలా శివశంకరప్రసాద్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన కమిటీని అనుమోలు ప్రభాకరరావు, దండమూడి సాయిసుధ, వడ్లమూడి శుభశేఖర్‌లు అభినందించారు.



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

సమ్మెలో పాల్గొంటాం

పెనమలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తాడిగడప మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌కు మునిసిపల్ కార్మికులు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. 20న జరిగే సమ్మెకు పొడిగింపుగా 21, 22న తాము విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో ఉప్పాడ త్రిమూర్తులు, కాసీం, వై సరళ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెనమలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : బందరు రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిగడప శ్రీనగర్‌కట్టకు చెందిన మట్టే కృష్ణ తారక్(35) తన స్నేహితుడితో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా వాహనం ముందు ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెళుతోంది. ఆసమయంలో వర్షం పడుతోంది. సరిగా చూసుకోని కృష్ణ తారక్ బస్సును వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో ఇద్దరు స్నేహితులు కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడ్డ కృష్ణతారక్‌ను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.







కాటూరులో నిరుపయోగంగా ఉన్న నూతన పీహెచ్‌సీ భవనం.. భవనానికి తాళం వేసిన కాంట్రాక్టర్

పగుళ్లిచిన రోగుల గది గోడలు

కూలేందుకు సిద్ధంగా పీహెచ్‌సీ!

- శిథిలావస్థకు చేరిన కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- భయపడుతున్న రోగులు, సిబ్బంది
- నూతన భవనానికి బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణ పనులు పూర్తిచేయని కాంట్రాక్టరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



శిథిలావస్థకు చేరుకున్న కాటూరు పీహెచ్‌సీ

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

కాటూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలాస్థకు చేరుకుని ఎప్పుడు కూలు తుందో అన్న భయంతో వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, రోగులు బిక్కుబిక్కు మంటూ చికిత్స పొందుతున్నారు. మరోపక్క కోటిన్నర రూపాయలతో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మించిన నూతన భవన నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు మిగిలిన పనులు పూర్తిచేయకుండా భవనానికి తాళంవేసి ఆరోగ్య కేంద్రానికి అప్పగించక పోవడంతో పాత భవనంలో వైద్యులు కాలక్షేపం చేస్తున్నారు. 1966లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి, ఇదే ఆవరణలో వైద్యులు, సిబ్బంది నివాసానికి క్వార్టర్లకు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయినప్పటి నుంచి అందులో కాటూరు పరిసర గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. ఈ క్రమంలో కొంతకాలం నుంచి సిబ్బంది క్వార్టర్లలో నివాసముండే వారు లేక అవి కూలిపోయాయి. ఈ క్రమంలో ఆరోగ్య కేంద్రం భవనానికి అనేక మార్లు మరమ్మతులు చేసినప్పటికి ఫలితం లేకపోవడంతో గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణం కాంట్రాక్టరుకు అప్పగించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే భవన నిర్మాణం మూడొంతులకు పైగా పూర్తయినా బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు పూర్తిచేయకుండా కాంట్రాక్టరు తలుపులకు తాళంవేసి బిల్లులు వస్తేనే పూర్తిచేసి అప్పగిస్తానని భీష్మించుకు కూర్చున్నాడు. దీంతో సంవత్సరాల తరబడి వినియోగంలో లేకపోవడంతో నూతన భవనం కూడా పగుళ్లిచ్చి పనికి రాకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనం ఉపయోగంలోకి వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు పరిస్థితి తెలియజేశాం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలు మార్లు తీసుకువెళ్లాము. నూతన భవనం ఉపయోగించుకునే వీలు లేకపోవడంతో పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నాం.

-ఎస్.శివరామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యుడు



గన్నవరంలో సంబరాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి

గన్నవరం, మే 7 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేయటం హర్షణీయమని టీడీపీ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేయటంతో బుధవారం గన్నవరం పట్టణంలో కూటమి శ్రేణులు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ, కేవలం ఉగ్రవాదులనే టార్గెట్ చేసి తుదముట్టించటం మంచి విషయమన్నారు. కూటమి నాయకులు చిమట రవివర్మ, ఆళ్ల దమయంతి, దేవినేని సులోచన, అరవపల్లి బోస్, సూరిబోయిన రాం బాబు, ఎంపీటీసీలు పడమట రంగారావు, మద్దినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఉగ్రవాదాన్ని భారతదేశం ఉక్కుపాదంతో అణచివేస్తుందన్న ప్రధాని మోదీకి అందరం మద్దతుగా నిలబడాలని రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అన్నారు. కానుమోలు హైస్కూల్ ఆవరణలో ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా బుధవారం విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు.

స్టాక్ పాయింట్లలో మెటీరియల్ లెక్క తేల్చాలి



విజయవాడ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచిన మెటీరియల్ లెక్కలు తేల్చాలని ఏఎంసీ మాజీ డైరెక్టర్ దండు సుబ్రహ్మణ్యంరాజు ఎంపీడీవో విగ్గిన్స్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో బుధవారం కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇళ్ల నిర్మాణం కోసం స్టాక్ పాయింట్లో ఉంచిన ఐరన్, సిమెంట్, ఇసుకను అక్రమ మార్గంలో తరలించారని అనుమానాలు ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



టీడీపీ మద్దూరు గ్రామాధ్యక్షుడు యనమదల మదన్ మోహన్‌ను అభినందిస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని, గొంది, తుమ్మలపల్లి తదితరులు

పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయండి

కంకిపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కంకిపాడు మండలంలోని మద్దూరులో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మద్దూరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. పార్టీ మద్దూరు గ్రామ అధ్యక్షుడిగా యనమదల మదన్ మోహన్, ఉపాధ్యక్షుడిగా వల్లభనేని నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా జుజ్జవరపు శ్రీనివాసరావు, కార్యనిర్వాహణ కార్య దర్శులుగా వీరంకి బాలకృష్ణ, కె. హరి నాగదుర్గ, లింగాల వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా పామర్తి శివపార్వతి, వల్లభనేని లోకేష్, ఏసుపాదం, కోశాధికారిగా సత్యనా రాయణ తదితరులను నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ, తుమ్మలపల్లి హరికృష్ణ, బండి నాంచారయ్య, శేష కుమారి, యనమదల వెంకటేశ్వరరావు, వల్లె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యువతను విస్మరించిన బీజేపీ ప్రభుత్వం

గన్నవరం, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది 2కోట్ల మంది యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ హామీని విస్మరించారని సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్ది వాసుదేవరావు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్‌లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ పాలనలో యువతను తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే రంగంలో 15లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కట్టవరపు విజయరావు, నూతక్కి మోహనరావు, ధీరజ్ లోకేష్, చరణ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడులో గ్రామసభ రేపు

హనుమాన్‌జంక్షన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీక రించేందుకు ఈ నెల 9న బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయిలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నిర్వహించే గ్రామసభకు మండలస్థాయి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

భావన ఋషి విగ్రహ ప్రతిష్ఠ నేడు

గన్నవరం, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పురుషోత్తపట్నం శివారు వీఎన్‌పురం కాలనీ సమీపంలో భద్రావతి సమేత భావన ఋషి స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీభద్రావతి సమేత భవన ఋషి స్వామివార్ల దేవస్థానానికి కేసరపల్లికి చెందిన మూల్పూరు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ. 25,011 నగదును బుధవారం అందజేశారు. మూల్పూరి మాధవన్, సాంబశివరావు, యుగంధర్, శ్రీనివాసరావు, గాంధీ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ తనిఖీలు

ఉయ్యూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్, అపరేషన్ విభాగ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించి అదనపులోడు వాడుతున్న వారితోపాటు, గృహేతర అవసరాలకు విద్యుత్ వినియోగిస్తున్న వారికి రూ. 6,98,500 అపరాధ రుసుం విధించారు. డీపీఈ జీఎం బి.విజయకృష్ణ, ఆధ్వర్యంలో డీపీఈ ఈఈ సీహెచ్ వాసు, ఆపరేషన్ ఈఈ డి.కృష్ణనాయక్, 30మంది అధికారులు, సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి ఉయ్యూరు, గండిగుంట, ఎగినపాడు, నాగన్నగూడెం, ఆనందపురం, మూర్తిరాజుపాలెంలో విస్తృతంగా తనిఖీలు చేసి అనుమతించిన కేటగిరీకి బదులు ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుతున్న ఇద్దరికి రూ. 6,500, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 207 మందికి రూ. 6,92,000 కలిపి రూ. 6,98,500 అపరాధ రుసుం విధించినట్టు కృష్ణనాయక్ తెలిపారు.

ఓండ్రంపాడులో ధ్వజస్తంభ ప్రతిష్ఠ 10న

ఉంగుటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓండ్రంపాడు దాసాంజనేయస్వామి దేవస్థానంలో జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహో త్సవం ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. శనివారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహము, రత్నన్యాసం, ధాతున్యాసం, యంత్ర స్థాపన, ముహూర్తమునకు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, కళావాహనం, శాంతి కల్యాణం, మహ దాశీర్వచనం జరుగుతాయని తెలిపారు.



జంక్షన్ వాసవీమాత ఆలయంలో సామూహిక కుంకుమ పూజ

ఘనంగా వాసవీమాత జయంతి

హనుమాన్‌జంక్షన్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏలూరు రోడ్డులోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీ మాత జయంతి ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి రామారావుజయంతి వేడుకన పర్యవేక్షించారు.. అనంతరం వాసవీ మాతకు రథోత్సవం జంక్షన్ ప్రధాన రహదారుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా 700 మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వెచ్చా వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు కొనకళ్ల రాజశేఖర్, పైడి సుధాకర్, చామర్తి రాంబాబు, నారికమల్లి ప్రసాద్, కంభంపాటి శ్రీనివాసరావు, పాబోలు బదరీనాథ్, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, చామర్తి లోక్‌నాథ్,గార్లపాటి రామకృష్ణ, ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకురాళ్లు మిట్టపల్లి లలిత, గార్లపాటి కల్యాణి పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి నివాళి



ఉయ్యూరు, మే 7 (ఆంధ్ర జ్యోతి) : బ్రిటీష్ మహా సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో బుధ వారం ఆయన చిత్రపటానికి ఎంపీడీవో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మన్యవీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి త్యాగనిరతి ఎనలేనిదన్నారు. ఏపీఎం అమరేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్‌ధారణపై అవగాహన

గుణదల, మే 7 (ఆంధ్రజ్యోతి) : పులిహోర.. మజ్జిగ పంపిణీ చేసి హెల్మెట్ దారణ విధిగా పాటించాలంటూ వాహనచోదకులకు పటమట ట్రాఫిక్ ఎస్సై ఆదినారాయణ హితబోధ చేశారు. వాహన చోదకులకు ప్రసాదంపాడు వద్ద పులిహోర.. మజ్జిగ పంపిణీ చేసిన ఆయన హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని తెలియజేశారు. ఎండల్లో ప్రయాణం చేసేవారు ఎక్కువగా మంచినీరు తాగాలన్నారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణాలు మంచిది కాదని, పార్కింగ్ జోన్ కాని ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేయడం నేరమని తెలిపారు. పాదచారులు విధిగా ఫుట్‌పాత్‌లపైనే నడవాలని తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని చెప్పారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని రిసోర్స్ పర్సన్ బి.జ్యోతి అన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు బుధవారం లెక్కలు తేలికగా చేసే విధానాలు, సూత్రాలపై అవగాహన కల్పించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడమే వేసవి శిక్షణ శిబిర లక్ష్యమని గ్రంథాలయాధికారి పి. స్వర్ణలతాదేవి తెలిపారు. వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా యోగాసనాలను నేర్పించారు. ● కానుమోలు గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షణలో మహనీయుల జీవితచరిత్ర పుస్తకాలు చదివించి వారు నేర్చుకున్న అంశాలపై సమీక్ష నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలి

అవనిగడ్డ, మే 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వానికి ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం అవనిగడ్డలో ఆయన మాట్లాడారు. మినుము పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు, కౌలు రైతులు లబోదిబోమంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష రైతు సంఘాల సమైక్య ఆధ్వర్యంలో రైతుల పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు కోసం మే 20న జరిగే దేశవ్యాప్త ఆందోళన, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని రైతులు, కౌలు రైతులకు ఆయన పిలుపునిచ్చారు.




హంసలదీవి సముద్ర తీరంలో గస్తీ నిర్వహిస్తున్న మెరైన్, స్థానిక పోలీసులు, తాళ్లపాలెం హైస్కూల్‌లో మాక్‌డ్రిల్

అంతటా అప్రమత్తం

పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నేపథ్యంలో తీరంలో గస్తీ

మచిలీపట్నం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో పాకిస్తాన్ తీవ్రవాదులు సముద్రతీరంలోకి చొచ్చుకు రాకుండా ఎస్పీ గంగాధర్ ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు అప్రమత్తమై తీరంలో నిఘా పెట్టారు. క్షుణ్ణంగా గ్రామాలను పరిశీలిస్తున్నారు. కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీస్తున్నారు. జిల్లాలోని తీర ప్రాంతాలు గిలకలదిండి, పాలకాయతిప్ప, ఒర్లగొందితిప్పలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆ గ్రామాలను ఆరు డ్రోన్లు నిరంతరం గమనిస్తున్నాయని, ప్రభుత్వం ఇచ్చిన బోట్లు చిన్నచిన్న రిపేర్లు వల్ల పనిచేయడం లేదని పోలీసులు తెలిపారు. కొత్త వారు వస్తే వివరాలు సేకరించి ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేస్తున్నామన్నారు.

తాళ్లపాలెంలో మాక్‌డ్రిల్

అనుకోని పరిస్థితులు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, భయాందోళనకు గురికాకుండా మనోధైర్యంతో జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో కె.స్వాతి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం ఆర్డీవో ఆధ్వర్యంలో తాళ్లపాలెం హైస్కూల్ ప్రాంగణంలో సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ అవతార్, జిల్లా విపత్తులు అగ్నిమాపక అధికారి ఏసురత్నం, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, సీఐ పరమేశ్వర్ పాల్గొన్నారు.

హంసలదీవి సముద్ర తీరం వెంబడి గస్తీ

కోడూరు: దేశ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ఎవరైనా అనుమానాస్పద బోట్లు కనిపించినా, కొత్త వ్యక్తులు సంచరించినా, సముద్ర తీరం వెంబడి గ్రామాల మత్స్యకారులు, గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై చాణక్య సూచించారు. బుధవారం ఉగ్రవాదుల అక్రమ చొరబాట్లను నియంత్రించేందుకు హంసలదీవి సముద్ర తీరం వెంబడి మెరైన్ పోలీసులు, కోడూరు పోలీసులు గస్తీ నిర్వహించారు. పాలకాయితిప్ప తీర గ్రామంలో ప్రజలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మెరైన్ ఎస్సై పూర్ణమాధురి, మెరైన్ సిబ్బంది, కోడూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' విజయంపై కొనకళ్ల, కొల్లు హర్షం

మచిలీపట్నం టౌన్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కొనకళ్ల నారాయణరావు మీడియాతో మాట్లాడారు. భారతీయ త్రివిధ దళాలు ఉగ్రవాదుల స్థావరాలను తుదముట్టించడం ముదావహమన్నారు.

యుద్ధభూమికి వెళ్లేందుకు సిద్ధం: మాజీ సైనికులు

మచిలీపట్నం టౌన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు మాజీ సైనికు లు.. మాజీ సుబేదార్ నూకల వెంకటేశ్వరరావు, మాజీ సార్జంట్, మాజీ హవల్దార్ వై.లక్ష్మణరావు, మాజీ సైనికుడు చింతా మత్తయ్య, అబ్బాస్ హర్షం వ్యక్తం చేశారు. పరాసుపేటలో మాజీ సైనిక సంఘం కా ర్యాలయంలో వారు మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను సైనికులు నేలమట్టం చేయడం ముదావహమన్నారు. సైనికులకు సహాయ సహకారాలు అం దించేందుకు, అవసరమైతే యుద్ధభూమికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న మాజీ సైనికులు నూకల వెంకటేశ్వరరావు, శరత్‌బాబు, లక్ష్మణరావు



టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

నెలాఖరులోపు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

అవనిగడ్డ, మే 7(ఆంధ్రజ్యోతి): 'తమ బాధ చెప్పుకొనేందుకు ఎవరూ లేరని నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లా. ఈ నెలాఖరులోపు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమిస్తుంది. టీడీపీ కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటా. ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తా.' అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. బుధవారం టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం కోడూరు రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. తనకు నియోజకవర్గ సమస్యలు తెలుసని, పరిష్కారానికి కృషి చేస్తానని కొనకళ్ల హామీ ఇచ్చారు. ఆరు మండలాల్లో కేఎస్ఎస్‌ల నియామకం, సంస్థాగత ఎన్నికల ప్రక్రియ త్వరలో ముగించేలా పార్టీ మండలాధ్యక్షులు బాధ్యత తీసుకోవాలని నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు సూచించారు. పార్టీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్, తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, తుమ్మల చౌదరిబాబు, బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు, నడకుదుటి జనార్దనరావు, బండే కనకదుర్గ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

మచిలీపట్నం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను పోటీ పరీక్షలకు వెళ్లే అభ్యర్థులతో పాటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను బుధవారం ఆమె పరిశీలించారు. డీఎస్సీ, కానిస్టేబుల్, తదితర పోటీపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులతో జేసీ మాట్లాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి.కిషోర్‌కుమార్, కార్యదర్శి హసీంబేగ్, డైరెక్టర్ కారుమూరి రాజేంద్రప్రసాద్, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి నగేష్ మాట్లాడారు.



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులతో జేసీ గీతాంజలి శర్మ

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

మోపిదేవి, మే 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం కేశఖండనశాలలో పని చేస్తున్న క్షురకులకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాన్ని పెంచినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బుధవారం ఆలయం ఎదుట చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఆలయ ఈవో డి.శ్రీరామ వరప్రసాదరావు సమక్షంలో క్షురకులు పాలాభిషేకం చేశారు. గతంలో అరకొర వేతనంతో పని చేస్తున్న తమకు కూటమి ప్రభుత్వం టికెట్లలో కమిషన్ ఇచ్చే ప్రయత్నం చేసిందని, ప్రస్తుతం రూ.20 వేల వేతనం రూ.25 వేలకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గౌరవవేతనాన్ని పెంచినందుకు పాలాభిషేకం చేస్తున్న క్షురకులు, మండలి వెంకట్రామ్

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు సత్కారం

మోపిదేవి, మే 7(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం నుంచి పెదకళ్లేపల్లి వరకు నూతన రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాబార్డు - ఆర్ఐడీఎఫ్ ద్వారా రూ.2 కోట్ల 60 లక్షల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను జనసేన నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అవనిగడ్డలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, నాయకులు కోసూరు నాగమల్లేశ్వరరావు, యడ్లపల్లి లక్ష్మణరావు(బుజ్జి), మెరకనపల్లి నరేష్, నడకుదుటి వెంకట రామరాజు, యర్రంశెట్టి సునీల్, కూరేటి రాఘవ, ఆకుల పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

ఐసెట్‌కు 292 మంది హాజరు

పెడన రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఐసెట్ 2025 పరీక్ష సజావుగా జరిగింది. బుధవారం ఉదయం 152 మందికి 147, మధ్యాహ్నం 152 మందికి 145 మొత్తం 292 మంది పరీక్ష రాశారని చీఫ్ సూపరింటెండెంట్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు.

నరసాపురం బస్సు అమలాపురం వరకు పొడిగింపు

అవనిగడ్డ, మే 7(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ డిపో నుంచి ప్రస్తుతం నడుపుతున్న నాగాయలంక-నరసాపురం బస్సు సర్వీసును ఈ నెల 9వ తేదీ నుంచి అమలాపురం వరకు పొడిగిస్తున్నట్టు డిపో మేనేజర్ కె.హనుమంతరావు బుధవారం తెలిపారు. నాగాయలంక నుంచి ఉదయం 6.20 గంటలకు బయలుదేరి 6.50కు అవనిగడ్డ వస్తుందని, మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను, భీమవరం, పాలకొల్లు, రాజోలు మీదుగా అమలాపురం వెళ్లి మధ్యాహ్నం 1.40 గంటలకు బయలుదేరి అదే మార్గంలో నాగాయలంక, అవనిగడ్డ చేరుతుందని తెలిపారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్/, పెడన/చల్లపల్లి/కోడూరు/నాగాయలంక, మే 7 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత జయంతి వేడుకలు బుధవారం మచిలీపట్నం, పెడన, చల్లపల్లి, కోడూరు, నాగాయలంకలో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి విశేషంగా అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు జరిగాయి. లక్ష మల్లెలతో అర్చన, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య పాల్గొన్నారు. పెడనలో వాసవీ మాతను 108 లీటర్ల ఆవుపాలు, 22 రకాల ద్రవ్యాలతో అభిషేకించారు. ఉభయదాతలు తమ్మన లలితా శంకర్, అన్నపూర్ణ దంపతులు గోపూజ, గణపతిపూజ, హోమం నిర్వహించారు. కొల్లూరి చిన్నా తమ్మన సుబ్బారావు పాల్గొన్నారు. చల్లపల్లిలో పొట్టిశ్రీరాములు వీధిలోని శ్రీఆర్యవైశ్య సంఘ భవనం నుంచి ఆర్యవైశ్య యువజన సంఘం వారితో పల్లకీసేవ, శ్రీవాసవీ మహిళా మండలి వారితో 58 రకాల పూలు, పండ్లను ఊరేగింపుగా పెదకళ్లేపల్లి రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవాలయానికి తీసుకెళ్లారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, లక్షల మల్లెల పూజలను ఆలయ అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ, లంక చక్రపాణి నిర్వహించారు. కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, జూపూడి సాయి పాల్గొన్నారు. కోడూరులో దేసు మల్లికార్జునరావు ఇంటి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఊరేగింపుగా శివరామకృష్ణ క్షేత్రానికి తీసుకువెళ్లారు. 102 గోత్రాల వారితో 102 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం, నవ విధ అభిషేకాలు నిర్వహించారు. నాగాయలంకలో అమ్మవారికి పాలాభిషేకాలు చేశారు. పురవీధుల్లో ఊరేగించి అనంతరం కృష్ణానది తీరాన తెప్పోత్సవం నిర్వహించి, అన్నదానం చేశారు. చిట్టా సాంబశివరావు, చిట్టా శివనాగేశ్వరరావు, వీర అన్నపూర్ణయ్య పాల్గొన్నారు.



మచిలీపట్నంలో ..



చల్లపల్లిలో..



పెడనలో..



కోడూరు పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

సమ్మె నోటీసు అందజేత

పెడన, మే 7 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20 నుంచి 22 వరకు జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తాము కూడా ఆయా రోజుల్లో సమ్మెలో పాల్గొంటామని మునిసిపల్ కమిషనర్ ఎం.గోపాలరావుకు పెడన మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. గోపాలరావు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ మేనేజర్ మట్టా రాజాకు వారు సమ్మె నోటీసు అందజేశారు. నందమూరు వెంకటేశ్వరరావు, కైలా జ్ఞానప్రసాద్, తాడిశెట్టి నాంచారయ్య, బి. సుబ్రహ్మణ్యం, జయకర్ ఉన్నారు.

సాంకేతికలోపం సరిదిద్దుతాం

● ఉపాధి కూలీలతో ఇన్‌చార్జి ఏపీవో వజీర్ అహ్మద్

పెడన రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] ఉపాధి కూలీలు పనులు చేసినా మస్తరులో నమోదు కాక ఆందోళన చెందుతున్నారని 'పర్యవేక్షణాలోపం - ఉపాధి శ్రామికులకు శాపం' పేరుతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఇన్‌చార్జి ఏపీవో వజీర్ అహ్మద్ స్పందించారు. బుధవారం బల్లిపర్రు వెళ్లి ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిచేసిన రోజులకు మస్తరు నమోదు కాకపోవడం సాంకేతికలోపమని, దానిని సరిదిద్ది, పనులు చేసిన వారికి వేతనాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. పనులు అడిగిన ప్రతి వారికి పనులు కల్పించేలా వర్క్‌లకు అనుమతులు పొందుతామని తెలిపారు. పనితీరు మార్చుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకన్నను ఆయన హెచ్చరించారు.

ఉపాధి పనుల పరిశీలన

మచిలీపట్నం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): బందరు మండలం చినకానూరు, పెదకానూరు దేవుడి చెరువుల్లో ఉపాధి కూలీలు చేస్తున్న పూడికతీత పనులను బుధవారం తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పరిశీలించారు. 372 మంది కూలీల పనుల మస్తర్లను ఆయన పరిశీలించారు. పీతా రాము, బొమ్మిడి పెద ఏడుకొండలు, గోపు వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ బోట్ల రాజేష్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడం పనులు నిలిపివేత

మోపిదేవి, మే 7(ఆంధ్రజ్యోతి): కొక్కిలిగడ్డ గ్రామశివారులో పదో నెంబరు కాలువ గట్టుపై నిర్మిస్తున్న అక్రమ కట్టడం పనులను పంచాయతీ, రెవెన్యూ ఉద్యోగులు నిలుపుదల చేశారు. పదో నెంబర్ కాలువ గట్టు రైతులకు వెళ్లే పంట బోదె మధ్యలో ఉన్న స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాన్ని తహసీల్దార్ ఎం.శ్రీవిద్య ఆదేశాల మేరకు నిలుపుదల చేశారు.

టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు

మచిలీపట్నం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లలో మిగిలిపోయిన లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేసేందుకు బుధవారం అధికారులు కసరత్తు చేశారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ యు.వీరదాస్, దేవరప్రకాష్, లైసన్ ఆఫీసర్ ఆనందరావు, మెప్మా సీఎంఎం ఆనంద్, టిడ్కో సీఎల్టీసీ నాగరాజు చర్చలు జరిపారు. బ్యాంకుల ద్వారా రుణాలిచ్చేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆదర్శనేత కొల్లి చక్రపాణి

మోపిదేవి, మే 7(ఆంధ్రజ్యోతి): ఆదర్శనేత కొల్లి చక్రపాణి అని, ప్రస్తుత రాజకీయాల్లో ఉన్న యువత చక్రపాణి ఆశయాలు, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ సూచించారు. బుధవారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొల్లి చక్రపాణి 9వ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద వెంకట్రామ్ నివాళులర్పించారు. కూటమినాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, చలపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, దిడ్ల జానకి రాంబాబు, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

కోడూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించటమే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ లక్ష్యమని ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం వి.కొత్తపాలెంలో పంచాయతీ సహకారంతో నాంది సంస్థ నిర్మించిన ఏటీఎం తరహా వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ యలవర్తి నాంచారయ్య పాల్గొన్నారు.

మిగులు భూములు పేదలకు పంచాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్

మచిలీపట్నం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పామర్రు మండలం అయినంపూడి గ్రామంలోని మిగులుభూములను పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో సుమారు 11 ఎకరాల భూములను కొంతమంది భూస్వాములు ఏళ్ల తరబడి అనుభవిస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఆ భూములను పేదలకు పంచాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నామన్నారు. భూములు లేని పేదలకు పంచాలని అడిగిన వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఒడుగు గంగాధరప్రసాద్, ముళ్లపూడి విల్సన్‌తో పాటు ఇద్దరు గ్రామస్తులను అరెస్టుచేసి గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఆయన ఖండించారు.



ఘంటసాల కేవీకేలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు

పోరాట యోధుడు అల్లూరి

ఘంటసాల, మే 7(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎదిరించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి వర్థంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నాపురం పీహెచ్‌సీలో అదనపు గదులకు శంకుస్థాపన

మచిలీపట్నం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘ నిధులతో చిన్నాపు రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రూ.45 లక్షలతో నిర్మించే అదనపు గదుల నిర్మాణానికి బుధవారం మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. భవనంలో సమావేశపు హాలు, రోగులకు మందు ఇచ్చే గది, వైద్య పరీక్షలకు గది నిర్మిస్తున్నారు. సర్పంచ్ కాగిత గోపాలరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో అధిక భూసారం

మోపిదేవి, మే 7 (ఆంధ్రజ్యోతి): భూసారం పెంచడానికి పచ్చిరొట్ట ఎరువులు దోహదపడతాయని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. బుధవారం రావివారిపాలెంలో భూసార పరీక్షలు, పచ్చిరొట్ట విత్తనాల వాడకంపై రైతులకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించాలని ఐరైతులకు ఆమె సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మేనత్త కుమారుడు మోసం చేశాడని యువతి ఫిర్యాదు

చల్లపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి, పలుమార్లు బలవంతంగా లొంగదీసుకుని గర్భవతి అని తెలిసిన తర్వాత తనకు సంబంధం లేదని మేనత్త కుమారుడు మోసం చేశాడంటూ యువతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ఒంగోలు సమీపంలోని ఆకుల అల్లూరుకు చెందిన ఆమె మేనత్త కుమారుడు యాటగిరి సాయికుమార్ మోసం చేశాడు. ఇక్కడకి వచ్చినప్పుడల్లా యువతిని ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. గత ఏడాదిలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో పెళ్లిచేసుకుంటా అని నమ్మబలికి బలవంతం చేశాడు. అప్పటి నుంచి అప్పుడప్పుడూ వచ్చి, ఇక్కడ ఉన్న రోజుల్లో ఆమెను శారీరకంగా లొంగదీసుకుంటున్నాడు. గత నెల 15న నీరసంగా ఉన్న ఆ యువతిని ఆమె తల్లి చల్లపల్లిలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లగా గర్భవతి అని నిర్ధారణ అయింది. మేనత్త కొడుకు కారణమని చెప్పడంతో సాయికుమార్‌ను పిలిచి పెళ్లిచేసుకోమని అడిగితే అందుకు నిరాకరించాడు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై పీఎస్వీ సుబ్రహ్మణ్యం నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

ఘనంగా వాసవీమాత జన్మదిన వేడుకలు

పామర్రు, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయవాడ రోడ్డులో వేం చేసి ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం వాసవీమాత జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక హోమాలు ఆలయ ధర్మకర్త బొగ్గవరపు జాలయ్య పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు మాధవచార్యులు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ యువజన సంఘ నేతలు చంద్రమౌళి, రామకృష్ణ , తాళ్లూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : ఆర్యవైశ్యుల కుల దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు వెంట్రప్రగడలోని అమ్మవారి దేవాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకారంలో వాసవీమాత

మినుముల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పామర్రు : అన్నదాతలు పండించిన మినుము పంటకు సరైన గిట్టుబాటు ధరల్లేక రైతులు ఎంతో ఇబ్బందులెదుర్కొంటున్నారని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. రైతులు మినుమును విక్రయించుకోనేందుకు అవసరమైన కొనుగోలు కేంద్రాన్ని పామర్రు మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాసుతో కలసి ఐనంపూడిలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మకు విజ్ఞప్తి చేశారు. పామర్రులో మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.



జలమయమైన కూచిపూడి - చల్లపల్లి ప్రధాన రహదారి

కూచిపూడిలో కుంభవృష్టి వర్షం

కూచిపూడి: బుధవారం కూచిపూడిలో కుంభవృష్టిగా వర్షం కురిసింది. రహదారులు చెరువులను తలపించాయి. దీంతో జనజీవనం స్తంభించింది. బస్టాండ్ ప్రాంతం, బార్లపూడి, పెదపూడి రహదారులు ప్రధాన సెంటర్‌తోపాటు కళాపీఠం రహదారి జలమయంగా మారాయి. ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా గంటపాటు కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. కూచిపూడి, పెదపూడి గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటం వల్ల కొద్దిపాటి వర్షానికే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి.

ఉచిత వైద్యశిబిరం

గుడివాడ : స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాల వద్దగల రేవతి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్, విజయవాడ మెడికేర్ ఆస్పత్రి వైద్య బృందం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ మురళీకృష్ణా రెడ్డి, డాక్టర్ లక్ష్మీ శ్రీరేఖ, డాక్టర్ అజయ్, డాక్టర్ సాగర్‌లు వైద్య సేవలందించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఈశ్వర వెంకటేశ్వరరావు, పూర్వ గవర్నర్ పర్వతనేని చంద్రశేఖరరావు, క్లబ్ కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాసరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌పీ సభలను జయప్రదం చేయాలి

గుడివాడ : బహుజన సంకల్పంతోనే రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 20న అన్ని జిల్లాల్లో సంకల్ప సభలను నిర్వహించనున్నట్టు బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక బీఎస్‌పీ కార్యాలయంలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

అధ్వాన రహదారిపై ప్రయాణం నరకం

● భారీ గోతులతో వాహనదారులకు తప్పని తిప్పలు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పామర్రు) : ఉండ్రపూడి - పోలవరం ప్రధాన రహదారి పూర్తి అధ్వాన స్థితికి చేరుకుంది. దాదాపు ఐదుకిలోమీటర్ల దూరం గల ఆర్‌అండ్‌బీ రహదారిలో అడుగడుగుగా పెద్దపెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. కొద్దిపాటి వర్షానికే గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో ఏది గోతో, ఏది రహదారో తెలియక పడరానిపాట్లు పడాల్సి వస్తుంది. గ్రామంలో హరిజనవాడకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని చెరువును తలపించే విధంగా గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారికి ఇరువైపులా 1800 ఎకరాల్లో రైతులు సాగుచేసుకుంటున్నారు.



ధ్వంసమైన ఉండ్రపూడి - పోలవరం రహదారి



పోలవరంలో రహదారిపైకి తేలిన కంకరరాళ్లు

దీర్ఘకాలంగా రహదారిపనులు పెండింగ్‌లో ఉండడంతో తమ పంట ఉత్పత్తులను ఇళ్లకు తెచ్చుకోవాలన్నా, కూలీలు రావాలన్నా ఈ రహదారిపై ప్రయాణించడానికి గ్రామస్థులు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చదువు నిమిత్తం సైకిళ్లపై వెళ్లే విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పామర్రు నుంచి పోలవరం,ఉండ్రపూడి, నిమ్మకూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

పామర్రునుంచి పోలవరం, ఉండ్రపూడి వయా నిమ్మకూరు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సిఫార్సు మేరకు రూ.4 కోట్ల అంచనాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలకాగానే నూతన రహదారి నిర్మిస్తాం.

పాలపర్తి సురేష్, ఆర్‌అండ్‌బీ జేఈ

ప్రభుత్వ మిగులు భూములు పేదలకు పంచాలి

మచిలీపట్నం టౌన్ : ఐనంపూడిలో ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నం సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములు లేని పేదలకు పంచాలని అడిగిన వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఒడుగు గంగాధరప్రసాద్, ముళ్ళపూడి విల్సన్ లతో పాటు ఇద్దరు గ్రామస్తులను అరెస్టు చేసి గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఖండించారు.

పామర్రు: ఐనంపూడి మిగులు భూములు పేదలకు చెందుతాయని గతంలో చెప్పిన టీడీపీ నేతలు నేడు అధికారంలోకి రాగానే ప్లేట్ మార్చడం న్యాయమేనా అని పామర్రు నియోజకవర్గ సీపీఎం కార్యదర్శి ఒడుగు గంగాధర్ ప్రసాద్ అన్నారు. బుధవారం పామర్రు ఐనంపూడి సీలింగ్ భూములను ఏపీఐఐసీకి బదాలయింపునకు గ్రామంలోకి విచ్చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో చర్చించేందుకు ముందుకు వస్తున్న తరుణంలో గంగాధర్‌ప్రసాద్‌తోపాటు పలువురు కార్మిక సంఘనేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని గుడ్లవల్లేరు స్టేషకు తరలించారు. వ్యవసాయకార్మిక సంఘనేత విల్సన్, జోసఫ్‌తంబి, ఎం.వేంకటేశ్వరరావు ఉన్నారు.

సచివాలయాల వద్ద క్యూఆర్ స్కానర్ల ఏర్పాటు

గుడ్లవల్లేరు : మన మిత్ర వాట్సాప్ యాప్ గవర్నెన్స్ క్యూఆర్ స్కానర్ కోడ్‌ల స్టాండ్‌లు మండలంలోని ప్రతీ సచివాలయం వద్ద ఏర్పాటు చేశామని ఎంపీడీవో టి.విజయసారథి తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల వద్ద ఈ స్కానర్ ఉన్న స్టాండ్‌లను బుధవారం ఏర్పాటు చేశారు. మన మిత్ర వాట్సాప్ యాప్‌కు సంబంధించిన కరపత్రాలను సచివాలయ సిబ్బంది ఇంటింటికీ పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని ఆయన చెప్పారు.

'ఆపరేషన్ సిందూర్'తో భారత్ సత్తా తెలిసింది

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్

గుడివాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా ఏమిటో యావత్ ప్రపంచం చూసిందని ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్‌లు పేర్కొన్నారు. ప్రజావేదికలో ఆపరేషన్ సిందూర్ గురించి వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ తెలిపిన వివరాలను బుధవారం వారు తిలకించారు. ఎమ్మెల్యేలు వెనిగండ్ల, కాగితలు విలేకరులతో మాట్లాడుతూ పహల్గాం కిరాతక దాడికి భారత్ ప్రతీకార చర్య చూపిందన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, రాంబాబు, జగన్మోహనరావు, ఏసుపాదం పాల్గొన్నారు.

పామర్రు : పహల్గాంలో చేసిన ఉగ్రదాడికి కౌంటర్‌గా పాకిస్తాన్‌పై భారత సైన్యం మిసైల్స్‌తో ఆపరేషన్ సిందూర్ పేరుతో చేసిన దాడి ఎంతో సాహసోపేతమైనదని, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాకిస్తాన్‌పై భారతీయ సైన్యం చేస్తున్న ప్రతీకార చర్యలతో యావత్తు భారతీయుల్లో ఆత్మస్థైర్యం నింపుతుందన్నారు.



ప్రసంగాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల, కాగిత

గుడివాడ రూరల్ : ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవ్వటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు గుడివాడ మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ అన్నారు. బుధవారం బొమ్ములూరులో జై భారత్, జై జవాన్ అనే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

గుడివాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీనివాస్ సెంటర్‌లో ఉత్సవ పందిరిలో గత పదిరోజులుగా కొనసాగుతున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ప్రతిరోజూ సాయంత్రం దాతల సహకారంతో భక్తి, సంగీత,గాన, నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆఖరి రోజు స్వామివారు జీవసమాధి అయినరోజు సందర్భంగా స్వామి జీవసమాధిని ఏర్పాటుచేశారు. భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార, ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాలూరి సూరిబాబు, చింతలూరి సత్యనారాయణ, ఆముదాలపల్లి గోవర్ధనాచారి, యలమర్తి కోటేశ్వరరావు, శనగపాటి నాగేశ్వరరావు, రూప పాల్గొన్నారు.



స్వామివారి జీవసమాధిని దర్శించుకుంటున్న భక్తులు

స్థానిక రాచకుళ్లవారి వీధిలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి జీవసమాధిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ కార్యదర్శి రాచకుళ్ల సురేష్‌బాబు, సభ్యులు అమృతలూరి పిచ్చేశ్వరరావు, కోటేశ్వరరావు, ఉద్యోగసంఘాల ప్రతినిధులు చింతలూరి సత్యనారాయన, వసుధ బసవేశ్వరరావు, రవి, సుధాకర్, కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

టిడ్కో కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తా

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

గుడివాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : టిడ్కోకాలనీవాసుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ అన్నారు. బుధవారం గుడివాడ మండలం, మల్లాయిపాలెం శివారు టిడ్కోకాలనీలో ఆయన పర్యటించారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయినేజీ సమస్యను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 34,35,36 వార్డుల్లో పర్యటించారు. మురుగుకాలువల పూడికతీత, వాటర్ పైపుల లీకేజీల ద్వారా కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నట్టు స్థానికులు పేర్కొన్నారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు వెంటనే ఆయా సమస్యల పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఏసుబాబు, డీవైఈఈ సతీష్‌చంద్ర, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

రికార్డులు పరిశీలన

గుడివాడ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌కే సెంటర్లలో వ్యవసాయానికి సంబంధించిన ప్రతి అంశాన్ని నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనంతలక్ష్మి అన్నారు. బుధవారం సెరిదింటకుర్రు ఆర్‌బీకే సెంటర్‌లోని రికార్డులను ఆమె పరిశీలించారు. ఆర్‌బీకే సెంటర్లలో సిబ్బంది జాగ్రత్తగా పని చేయాలని తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పామర్రు : ఎలకుర్రు అగ్రహారంలో వేం చేసి ఉన్న భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూల విరాట్‌కు, అమ్మవార్లకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతిపూజ, పంచామృతాలతో అభిషేకాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు కళాకారుల్ని సత్కరించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

పెదపారుపూడి, మే 7 (ఆంధ్రజ్యోతి) : పెదపారుపూడిలో వాహనాలను స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి తన సిబ్బందితో కలసి బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించామన్నారు. అలాగే తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని, చట్టాలు కఠినతరంగా ఉన్నాయని తెలియజేశారు.

కౌలురైతు గుర్తింపు కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నందివాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి సంబంధించి భూమి లేని సాగుదారులు , పొలం కౌలుకి తీసుకుని సాగు చేసే చిన్న, సన్న కారు రైతులు కౌలు రైతు గుర్తింపు కార్డులకు అర్జీ పెట్టుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి భానుప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందేందుకు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో , గ్రామ రెవెన్యూ అధికారిని గానీ, గ్రామ వ్యవసాయ సహాయకులను గానీ సంప్రదించి అర్జీ పెట్టుకోవాలన్నారరు. రానున్న ఖరీఫ్‌కి సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము 50 శాతం రాయితీతో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో రబీ సీజన్‌లో పెసర పండించిన రైతుల కోసం ప్రభుత్వం వారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. నందివాడ మండలానికి సంబంధించి ఆరుగొలను పీఏసీఎస్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో పెసలు, మినుము ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల ప్రకారమే కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నందివాడ : కొత్త రేషన్ కార్డు కావాలనుకునేవారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని మండల తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల్లోని తప్పుల సవరణకు ప్రభుత్వం ఆన్‌లైన్ సర్క్యులర్‌ను బుధవారం విడుదల చేసిందన్నారు

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

గుడివాడ : ఏడాదిన్నర క్రితం అదృశ్యమైన వ్యక్తి అచూకీ గుడివాడలో లభ్యమైంది. నంద్యాల జిల్లాలోని జెండాపేటకు చెందిన అబ్దుల్ తౌఫిక్ 2023 డిసెంబర్ నెలలో కనిపించకుండా వెళ్లాడని అతని కుటుంబ సభ్యులు బేతనచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గమనించి రైల్వేపోలీసులు ఆరా తీశారు. అతను నంద్యాలకు చెందిన తౌఫిక్‌గా పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి ఆచూకీ లభ్యత గురించి బేతనచర్ల పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం గుడివాడ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కుటుంబ సభ్యులకు తౌఫిక్‌ను అప్పగించినట్టు ఎస్సై మహబూబ్ తెలిపారు.

కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి వాసంశెట్టి సుభాష్



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

గుడివాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : కార్మికవర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం గుడివాడ విచ్చేసిన రాష్ట్రమంత్రులు వాసంశెట్టి, కొల్లు రవీంద్రలకు స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి మాట్లాడుతూ మెకానిక్ అసోసియేషన్ నాయకులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ, వ్యవస్థాపకులు ఆసీఫ్ అలీ, కోశాధికారి షేక్ జుబేర్, అంజనేయులు, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

అల్లూరి సేవలు స్ఫూర్తిదాయకం



గుడివాడలో..

గుడివాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని గుడివాడ క్షత్రియ సేవాసమితి అధ్యక్షులు కోసూరి కామరాజు(రవిరాజు) పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గుడివాడ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 1000 మందికి బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవాసమితి గౌరవాధ్యక్షులు గాదిరాజు జగ్గరాజు, కోశాధికారి కుచర్లపాటి శ్రీనివాసరాజు, క్షత్రియ ఫెడరేషన్ నాయకులు విజయ్‌కుమార్‌రాజు, డి.దామోదర్ రాజు, స్మారక కమిటీ చైర్మన్ సాగిరాజు ఉదయభాస్కరరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.ప్రసాదరావు, ప్రసాద్‌రాజు, సురేష్‌వర్మ పాల్గొన్నారు.

కూచిపూడి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి వేడుకలను కోసూరు గ్రామంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచారు. చిందా వీర వెంకట నాగేశ్వరరాజు, కెవి.అప్పారావు, మహాలి నాగరాజు, సలీమ్, గంగరాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



కూచిపూడిలో..



పామర్రులో..

పామర్రు: అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పామర్రులో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి ఎం.ఝాన్సీరాణి బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థులతో పుస్తక పఠనం కలిగే ప్రయోజనాలనుతెలియజేశారు.

జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో జరిగిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమంలో గ్రామ మహిళా మండలి అధ్యక్షురాలు ఉషాదేవి, గ్రామ ప్రముఖుడు వెంకటేశ్వరరావులు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంథాలయ అధికారి వి.నాగసురేష్, పాల్గొన్నారు.